
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 22 మే 2024



సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో సైబర్ నేరగాళ్ల బారిన పడిన బాధితుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. సెల్‌ఫోన్లకు ఎస్‌ఎంఎస్, వాట్సాప్ మెసేజీలు, లింకులు పంపుతూ బ్యాంకు అకౌంట్ల నుంచి సొమ్ములు మాయం చేస్తున్నారు. డబ్బులు కట్ అయినట్లు వస్తున్న మెసేజీలు చూసి మేల్కొనే లోపే ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. ఇందులో తమ ప్రమేయం ఏమాత్రం లేకున్నా సాంకేతికతో డబ్బులు కొట్టేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సైబర్ క్రైం నేరగాళ్లు ఎక్కడుంటారో.. ఎప్పుడు.. ఏ రూపంలో మోసం చేస్తారో.. ఎలా ఖాతాలు ఖాళీ చేస్తారో ఎవరికీ అంతుచిక్కని సమస్య. అరచేతిలో ప్రపంచం లాగా, అందిపుచ్చుకున్న సాంకేతికతతో అనుకున్న పని కానిచ్చేస్తున్నారు. అందులో పేద, మధ్యతరగతి, వ్యాపారులు, ఉద్యోగులే కాదు.. అన్ని వర్గాల వారు బాధితులుగా మారుతున్నారు.



క్లిక్ చేశారో..!

- నిమిషాల్లో ఖాతాలు ఖాళీ
- పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- ఖాతాల్లో డబ్బులు ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- ఫిర్యాదు చేసినా రికవరీ కాని డబ్బులు
- స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు



మదనపల్లె, మే 21: సైబర్ నేరాలన్నీ ఆన్‌లైన్ మోసాలే. డిజిటలైజేషన్, మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు, ఆధార్, పాన్‌కార్డుల అనుసంధానానికి లింకులతో మోసం చేస్తున్నారు. ఫోన్లకు మెసేజ్‌ల ద్వారానే కాదు.. టెలిగ్రామ్ మోసాలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. పార్ట్‌టైమ్ జాబ్, ఆన్‌లైన్ ఉద్యోగం, ఆఫర్లు, డిస్కౌంట్లు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వస్తుందని ఆశ పెడుతూ నిలువునా ముంచుతున్నారు. ఈ క్రమంలో నిరుద్యోగులు, ఆత్యాశపరుల అవకాశాన్ని ఆసరాగా చేసుకుని వారిని నమ్మించే క్రమంలో మొదట్లో డబ్బులు పంపుతున్నారు. జాబ్ కోసం లింకులు పంపుతూ వాటిని ఓపెన్ చేయమని చెబుతూ వారి ఖాతాల్లోని సొమ్ములను ఖాళీ చేస్తున్నారు. నేరం జరిగిన తీరును చూసినా, విన్నా..ఇలాగా కూడా మోసం చేస్తారా? చేయవచ్చా? అంటూ ఆశ్చర్యపోవడం మన వంతు అవుతోంది. ఇలా సైబర్ నేరం రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతోంది. పోలీసులు, సైబర్ క్రైం పోలీసులు, బ్యాంకు ఉద్యోగులు, ఆర్‌బీఐ, తదితర పేర్లు చెప్పి కూడా అనేక రకాలుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ప్రజలు, ఖాతాదారులను వీరి బారి నుంచి రక్షించే ప్రయత్నంలో పోలీసులు, బ్యాంకర్లు, ఆర్‌బీఐ, ఆర్థికశాఖ, ప్రైవేటు సంస్థలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాయి. సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు టోల్‌ఫ్రీ నెంబర్లు, సైబర్ రిపోర్టింగ్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. అయినా రోజూ మన చుట్టూ ఉన్నవారే మోసపోతున్నారు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మోసానికి గురై బాధితులుగా మారుతున్నారు.

మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరుతో పాటు ఇతర మండలాల్లో ఆన్‌లైన్ మోసాలు జోరందుకున్నాయి. సైబర్ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారు. ప్రజల సెల్‌ఫోన్లకు ఆన్‌లైన్ లింకులు, మెసేజ్‌లు పంపి వల విసురుతున్నారు. ఆ రకంగా ఖాతాల్లోని నగదు చోరీ చేస్తున్నారు. అంతుచిక్కని మోసాలతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో సైబర్ కేసులు పెరుగుతున్నాయి. బాధితులు పోలీస్‌స్టేషన్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ముఖ్యంగా నగదు రికవరీ కోసం ఎదురు చూస్తున్నారు. మదనపల్లె డివిజన్‌లో ఇలాంటి సైబర్ కేసులు ఎక్కువవుతున్నాయి. రోజువారీ జరుగుతున్న ఇలాంటి సంఘటనలలో వెలుగులోకి వస్తున్నవి కొన్నే అయినా..వివిధ కారణాలతో బయటకు రానివి మరెన్నో ఉంటున్నాయి. ఎందుకంటే మోసపోయిన వాడినే సమాజం నేరస్థునిగా చూస్తుండటంతో చాలా మంది బయటకు చెప్పుకోవడానికే భయపడుతున్నారు.

మెసేజీలు.. లింకులు పంపుతూ...

సైబర్ నేరగాళ్ల సెల్‌ఫోన్లకు ఆన్‌లైన్ లింకులు, మెసేజ్‌లు పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేసిన కొద్దిసేపటి తరువాత ఆ సెల్‌ఫోన్‌కు కాల్ వస్తుంది. తాము ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, మీ ఖాతాకు మొబైల్, ఆధార్ నెంబర్లు అనుసంధానం కాలేదని, తద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి రాదని కూడా నమ్మిస్తున్నారు. మొబైల్, ఆధార్ నెంబర్ చెబితే అనుసంధానం చేసి సెల్‌ఫోన్‌కు ఓటీపీ పంపి ఓకే చేస్తామంటూ మభ్యపెడుతున్నారు. ఈ మాటలు నిజమేనని నమ్మిన ప్రజలు వెంటనే వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతున్నారు. దీంతో నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానంతో ఖాతాల్లోని నగదును క్షణాల్లో కాజేస్తున్నారు. ఖాతాల్లో నగదు డ్రా అయిన వెంటనే సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోని, గుర్తించని వారూ ఉన్నారు. ఏటీఎం కార్డు జేబులో ఉండగానే, బ్యాంకు పాస్‌బుక్కు ఇంట్లో భద్రంగా ఉండగానే, తాను నగదు డ్రా చేయకనే ఖాతాలో ఉన్న రూ.లక్షలు మాయం అవుతున్నాయి. ఎప్పుడో డబ్బు అవసరమై ఏటీఎం కేంద్రానికి, బ్యాంకుకు వెళితే..అప్పుడు కాని చాలా మందికి తెలియడం లేదు. ఖాతాల్లో నగదు లేదని, ఉన్న సొమ్ము ఈ తేదీల్లో డ్రా చేశారంటూ బ్యాంకు అధికారులు చెబుతుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పెడితే, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయండి, ఆన్‌లైన్‌లో టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయండని చెబుతున్నారని బాధితులు అంటున్నారు.


బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం..మీ ఏటీఎం కార్డు కాలపరిమితి త్వరలో ముగుస్తుంది.. పిన్ నెంబరు చెబితే రెన్యువల్ చేస్తామంటూ ఖాతాదారులకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఆ వెంటనే ప్రజలు పిన్ నెంబరు చెబుతుండడంతో అవలీలగా ఖాతాల్లోని నగదు డ్రా చేసేస్తున్నారు. అలాగే లోన్ యాప్‌లతో కూడా ప్రజలు మోసపోతున్నారు. లోన్‌యాప్‌లకు ఆధార్, మొబైల్ నెంబర్ అడుగుతున్నారు. ప్రజలను మభ్యపెట్టి వివరాలు సేకరించడంతో పాటు అన్ని విధాలా మోసం చేస్తున్నారు. మరోవైపు సెల్‌ఫోన్లకు వచ్చే లోన్‌యాప్ లింకులను ఓపెన్ చేస్తుండడంతో రుణం తీసుకోకపోయినా.. తీసుకున్నట్లు క్రియేట్ చేస్తున్నారు. ఆ రకంగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో బాధితులు అప్పులు చెల్లించలేక బలవన్మరణాలకు పాల్పడిన సందర్భాలూ లేకపోలేదు. పోలీసులు సైబర్ నేరం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే నేరగాళ్ల మొబైల్ నెంబర్, వేలిముద్రలు, ఇతర వివరాలేవీ దొరక్కపోవడంతో నిందితులను గుర్తించలేకపోతున్నారు. దీంతో కేసుల ఛేదన కష్టమవుతోందని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల కన్నా...పట్టణాల్లోనే సైబర్ కేసులు ఎక్కువగా జరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా మదనపల్లె పట్టణంలోని బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు.

ఉదాహరణలివీ..

- మదనపల్లె మండలం దేవిరెడ్డిగారిపల్లెకు చెందిన ప్రతాప్ బ్యాంకు ఖాతా నుంచి రూ.73 వేలు సైబర్ నేరగాళ్లు నిమిషాల్లో కొట్టేశారు. ఏప్రిల్ 24వ తేదీ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో తన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఏటీఎం ద్వారా రూ.48 వేలు ఒకసారి, ఆ వెంటనే రూ.25 వేలు తీసినట్లు ఉంది. వెంటనే ప్రతాప్ మదనపల్లెలో తన ఖాతా ఉన్న కెనరా బ్యాంకుకు వెళ్లి విషయం చెప్పారు. మీరే ఏటీఎంలో డబ్బులు డ్రా చేశారని బ్యాంకు అధికారులు మొదట్లో చెప్పారు. నేను పొలం పనుల్లో ఉండగా ఈ మెసేజ్ వచ్చిందని తాను ఎక్కడా డ్రా చేయలేదని, తీసి ఉంటే నేను ఎక్కడ తీశాను.. ఏటీఎం పేరు, ఏరియా చెప్పాలని బాధితుడు ప్రశ్నించారు. వీరితో మాట్లాడుతుండగానే, రెండోసారి రూ.25 వేలు తీసినట్లు మెసేజ్ రావడం చూసి బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. అప్పటికే ఖాతా ఖాళీ అవడంతో ఖాతాను బ్లాక్ చేశారు. అస్సాంకు చెందిన సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి బ్యాంకింగ్ యాప్ ద్వారా స్వాహా చేసినట్లు చెబుతున్నారు. అంతకు ముందు కూడా ఇలాగే మెసేజీలు వచ్చినా బ్యాంకు ఖాతాలో డబ్బులు లేవని పెద్దగా పట్టించుకోలేదు. ఖాతా ఖాళీగా ఉండటంతో డబ్బులు తీయడానికి చేయడానికి వీలుకాలేదు. తర్వాత రెండురోజుల అనంతరం తనకు రావాల్సిన బాకీ డబ్బులు మరొకరి నుంచి అకౌంట్‌కు జమ కావడంతో అదేరోజు సాయంత్రమే ఖాతా ఖాళీ అయింది. దీంతో బాధితుడు అటు బ్యాంకుకు, ఇటు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటికీ పోయిన డబ్బులు రికవరీ కాలేదు. బాధితుడు ప్రతాప్ మాత్రం బ్యాంకు అధికారులు, సైబర్ పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు.
- మదనపల్లెకు చెందిన ఆనంద్‌కుమార్ పట్టణంలోని ఓ సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఈయన బ్యాంకు ఖాతా నుంచి గతేడాది అక్టోబరు 8వ తేదీ రూ.34 వేలు సైబర్ నేరగాళ్లు తీసేశారు. ఆ రోజు అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఆయన ఫోన్ నెంబరు నుంచే అదే ఫోన్‌కు కాల్ వచ్చింది. మీకున్న పేటీఎంను మీరేమీ మార్చలేదు కదా? అయితే, ఈ ఓటీపీని ఎంటర్ చేయండన్నది అందులోని సంక్షిప్త సమాచారంలోని సారాంశం. నిజంగా ఆనంద్‌కుమార్ పేటీఎంను మార్చడం లేదు కాబట్టే..అందులోనూ మనిషి కాకుండా ఐవీఆర్ రికార్డింగ్ ద్వారా వాయిస్ రావడంతో నిజమనుకున్నారు. ఓటీపీ చెప్పగానే ఖాతా ఖాళీ అయింది. వెంటనే వచ్చిన మెసేజ్‌ను చూసి సైబర్ క్రైంకు ఆన్‌లైన్‌లో, తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అది లోన్ యాప్ కావడంతో ఖాతాలో డబ్బులు లేకున్నా-సైబర్ నేరగాళ్లు పేటీఎం నుంచి రుణంగా హ్యాక్ చేశారు. అది కూడా మూడుసార్లుగా ఫోన్‌కు రీచార్జి రూపంలో, మరో రెండుసార్లు ఆన్‌లైన్ షాపింగ్ చేసినట్లు నమోదైనట్లు గుర్తించారు. ఆలోపు సంబంధిత అధికారులు, సంస్థలకు ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు చేశారు. సాధారణంగా ఆన్‌లైన్ షాపింగ్ చేసినప్పుడు ఆ వస్తువు..ఇంటికి చేరడానికి కనీసం రెండు రోజులు పడుతుంది. అప్పటిలోగా ఫిర్యాదుపై చర్యలు చేపట్టవచ్చని చెబుతున్నారు. కానీ ఆ సంస్థలు, సైబర్ పోలీసులు స్పందించకపోవడంతో తాను నష్టపోయానని బాధితుడు వాపోతున్నారు. తీసుకున్న రుణం చెల్లించాలని పేటీఎం యాప్ నుంచి మెసేజ్‌లు వస్తున్నాయి. ఈ పద్ధతిలో జరిగిన మోసం ఇదే ప్రథమమని పోలీసులు చెబుతున్నారు.
- మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఓ మహిళ ఖాతాలో నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.50 లక్షలు కొట్టేశారు. మేము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, మీకు వచ్చిన ఓటీపీ చెప్పాలని సూచించడంతో చెప్పిన నిమిషాల్లోనే ఖాతా ఖాళీ అయింది. దీంతో బాధితురాలు వెంటనే సీటీఎం రోడ్డులోని బ్యాంకుకు వెళ్లి ఆరా తీయడంతో తమకు సంబంధం లేదని చెప్పడంతో బాధితురాలు నిర్ఘాంతపోయింది. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు అనంతరం సైబర్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో నెల రోజులుగా ఆమె రాయచోటిలోని సైబర్ కేంద్రానికి వెళ్లి ఆరా తీస్తోంది. ఇలా సాంకేతికతో తన ప్రమేయం ఉన్నా. లేకున్నా ఖాతాలోని డబ్బులు ఖాళీ కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

అమ్మో! ఇన్ని రోజులా?

- ఏడు విడతల్లో పోలింగ్ కావడంతో లెక్కింపునకు ఆలస్యం
- 2019లో అయితే ఏకంగా 42 రోజుల తరువాత లెక్కింపు
- పారదర్శకత కోసమే సుదీర్ఘ విరామం



కలికిరి, మే 21: పోలింగ్ పూర్తయి ఇప్పటికే తొమ్మిది రోజులు అయింది. ఇక కౌంటింగ్ ఎప్పుడు? జూన్ 4న అంటే ఇంకా రెండు వారాలు ఆగాల్సి వస్తోంది. అంతవరకూ ఈ టెన్షన్ భరించేదెలా? ఇదీ ప్రస్తుతం సామాన్యుడి నుంచి అభ్యర్థుల వరకూ.. ఆపై పార్టీ హైకమాండ్‌ల వరకూ కనిపిస్తున్న నిట్టూర్పు. జిల్లాలో ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇక అసలైన పండుగ కౌంటింగ్. పోలింగ్ ముగిసిన ఇన్ని రోజులకు లెక్కింపును వాయిదా వేయడమేటనే విసుగు జనాల్లో సాధారణమైంది. దీని వెనుక పెద్ద తతంగమే ఉంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు కావడంతో వివిధ కారణాల వల్ల పోలింగ్‌కు, లెక్కింపునకు మధ్య వ్యవధి చాలానే ఉంది. దేశంలో మొత్తం ఏడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్న కారణంగా మొత్తం పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకూ లెక్కింపు చేపట్టడానికి వీల్లేదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేస్తోంది. మొదటి విడత జరిగిన పోలింగ్ ప్రాంతాల్లో లెక్కింపు చేపడితే వెల్లడయ్యే ఫలితాలు తరువాత జరగబోయే ప్రాంతాలను ప్రభావితం చేస్తాయనేది ప్రధానమైంది. కాగా ఎన్నికలను హింసాత్మక సంఘటనలకు అతీతంగా నిర్వహించేందుకు భారీ భద్రతా బలగాల అవసరం కూడా మరో ప్రధాన కారణంగా చెబుతారు. అంతేగాకుండా పోలింగ్‌కు, లెక్కింపుకూ మధ్య వ్యవధి ఎక్కువైతే పోలింగ్ రోజు స్థానికంగా తలెత్తే ఉద్రిక్తతలు వాటంతట అవే చక్కబడతాయనేది కూడా మరో వాదనగా ఉంది. ఏతావాతా ఎన్నికలను పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడానికి ఈమాత్రం వ్యవధి తప్పనిసరి అని కూడా అంటున్నారు.

మొదట్లో 4 నెలల తరువాత లెక్కింపు

గతంలో 8, 9 విడతల్లో ఎన్నికలు జరుగుతుండగా రెండు మూడు ఎన్నికల నుంచి ఏడు విడతల్లో నిర్వహిస్తున్నారు. సరిగ్గా వారానికి ఒక విడత వంతున మొత్తం ఎన్నికలు పూర్తి కావడానికి దాదాపు 50 రోజుల గడువు తీసుకుంటున్నారు. 1951-52లో జరిగిన మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ జరిగిన తేదీ తరువాత నాలుగు నెలలకు అంటే 120 రోజుల తరువాత లెక్కింపు చేపట్టారు. అప్పుడు 1951 అక్టోబరు 25వ తేదీ ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ 1952 ఫిబ్రవరి 21వ తేదీ నాటికిగానీ పూర్తి కాలేదు. ఈ ఎన్నికలను మొత్తం 68 విడతలుగా 120 రోజులపాటు నిర్వహించి ఆ తరువాత లెక్కింపు చేపట్టారు. ఆ తరువాత నేర్చుకున్న అనుభవాలతో క్రమేపీ వ్యవధి తగ్గించుకుంటూ వచ్చారు. 1957 ఎన్నికలను కేవలం 19 రోజుల్లో ముగించారు. ఆపైన 1962 నుంచి 1989 వరకూ కేవలం ఐదు నుంచి ఏడు రోజుల్లో పూర్తి చేయగలిగేవారు. అయితే ఎన్నికల రాక్షసుడిగా పేరొందిన టీఎన్ శేషన్ 1990లో ఎన్నికల కమిషనర్‌గా రావడంతో మొత్తం భారతదేశ ఎన్నికల విధానమే సమూలంగా మారిపోయింది. మొత్తం 150 విధాలుగా ఎన్నికల విధానం భ్రష్టుపట్టే పరిస్థితుల్లో ఉందని గుర్తించిన ఆయన 1991 నుంచి విడతల వారీ పోలింగ్ ప్రక్రియను మరింత ఆధునీకరించి అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి ప్రధానంగా భద్రతా బలగాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడానికి అనువుగా ఈ ఏడంచెల విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి మొదటి నాలుగు విడతల్లో ఎన్నికలు పూర్తయిన వారు లెక్కింపు కోసం సుదీర్ఘ కాలం ఎదురు చూడక తప్పడం లేదు. రాష్ట్రానికి సంబంధించి 1994 నుంచి లెక్కింపు కోసం సుదీర్ఘ కాలం ఎదురు చూడాల్సి రావడం పరిపాటయ్యింది. 1999 ఎన్నికల్లో 32 రోజులు, 2004లో 21 రోజులు, 2009లో 28 రోజులు, 2014లో 36 రోజుల తరువాత లెక్కింపు చేపట్టారు. 2019 ఎన్నికల్లో అయితే ఏకంగా 42 రోజులపాటు నిరీక్షించాల్సి వచ్చింది. జిల్లాలో అప్పుడు 2019 ఏప్రిల్ 11 మొదటి విడతలో పోలింగ్ పూర్తి కాగా మే 23వ తేదీన లెక్కింపు చేశారు. అంటే దాదాపు నెలన్నర తరువాత ఫలితాలు వెలువడ్డాయి. 1951-52 ఎన్నికల తరువాత అత్యంత వ్యవధి తీసుకున్న లెక్కింపు కూడా ఇదే అయింది. ప్రస్తుతం జిల్లాలో నాలుగో విడతలో పోలింగ్ పూర్తయినందు వల్ల 22 రోజుల వ్యవధి తీసుకోనుంది.

సుదీర్ఘ ప్రక్రియతో లాభమా.. నష్టమా?

ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ఎన్నికలు నిర్వహించడంలో 72 ఏళ్ల అనుభవం గడించిన భారత ప్రభుత్వం ఇప్పటికీ ఇంతగా వెనుకబడటం ఏమిటని అసహనం వ్యక్తం చేసే వారూ ఉన్నారు. కానీ గత ఇరవై ఏళ్ల క్రితం ఎన్నికలంటే పోలింగ్ బూత్‌లను ఆక్రమించడం, బ్యాలెట్‌బాక్సులను ఎత్తుకెళ్లడం, రిగ్గింగ్‌కు పాల్పడటం, బూత్‌ల లోపలా బయటా హింసాత్మక ఘటనలతో పోలింగ్ ముగిసేదని, దీన్ని సజావుగా నిర్వహించడం స్థానిక పోలీసులకు శక్తికి మించిన పనిగానే కాకుండా రాజకీయ నాయకులతో మొహమాటాలు, ఒత్తిళ్ళు, చేసేవని గుర్తు చేస్తున్నారు. ధనవంతులు, శక్తివంతులు, గుండాగిరీల మధ్య మాత్రమే పోలింగ్ బూత్‌లో విలవిల్లాడేవని కూడా వివరిస్తున్నారు. ఈ ఎన్నికల కోసం దాదాపు లక్షా 50 వేల మంది పారా మిలటరీ దళాలను రాష్ట్రాల సరిహద్దుల నుంచి విడతల వారీగా తరలించాల్సి రావడంతో ఈ వ్యవధి తప్పడం లేదని కూడా అంటున్నారు. అంతేగాకుండా ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా నిన్న జరిగిన ఎన్నికల్లో పలు ప్రాంతాలు హింసాత్మక సంఘటనలు విషయాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. పోలింగ్ ముగిసిన మరుసటి రోజే ఇంత పెద్ద స్థాయిలో అనూహ్య పరిణామాలు తలెత్తితే.. ఇక పోలింగ్ ముగిసిన రెండు మూడు రోజుల్లోనే ఫలితాలను వెల్లడించడం వల్ల స్థానిక ఉద్రిక్తతలు గెలుపోటముల ప్రభావంతో ఇంకెన్ని అరాచకాలకు దారితీస్తాయోనని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. మొత్తం మీద లెక్కింపునకు బాగా వ్యవధి తీసుకోవడం మీద ప్రస్తుతం చర్చ కూడా నడుస్తోంది. అయితే చివరి విడతలో ఎన్నికలు జరిగే ప్రాంతాల వారికి మాత్రం కేవలం మూడు రోజుల వ్యవధిలోనే లెక్కింపు పూర్తవుతుంది. మరి పై చెప్పిన అనర్థదాయక సంఘటనలు వీరికి వర్తించవా అని ప్రశ్నించే వారికి ఎన్నికల కమిషను మాత్రమే ప్రత్యామ్నాయం ఆలోచించి జవాబు చెప్పాల్సి ఉంది.

సబ్సిడీ విత్తనకాయలు సరఫరా

- మదనపల్లె డివిజన్‌కు 25,224 క్వింటాళ్ల విత్తనాలు

మదనపల్లె టౌన్, మే 21: ఖరీఫ్ సీజన్ కన్నా ముందస్తుగా వర్షాలు పడుతుండటంతో జిల్లాలోని పడమటి ప్రాంత రైతులు వేరుశనగ సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారని ఆంధ్రజ్యోతిలో 'ఇప్పుడు కాక..ఇంకెప్పుడు' శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. మంగళవారం మదనపల్లె వ్యవసాయ డివిజన్‌లోని 8మండలాలకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల సరఫరా మొదలుపెట్టారు. మదనపల్లె డివిజన్‌లో వేరుశనగ సాధారణ సాగు 51,952 ఎకరాలు ఉండగా, దీనికి 25,294 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరమని అధికారులు నివేదికలు పంపారు. మదనపల్లె డివిజన్‌లోని ఎనిమిది మండలాలకు గాను కే-6 రకం విత్తనకాయలు 22,770క్వింటాళ్లు, నారాయణి రకం 1100క్వింటాళ్లు, కదిరి లేపాక్షి రకం 924 క్వింటాళ్లు, విశిష్ట (టీసీజీఎస్)రకం 500 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేశారు. దీంతో పాటు వాల్మీకిపురం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, పీలేరు వ్యవసాయ డివిజన్‌లకు కూడా నేటి నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను వ్యవసాయశాఖ అధికారులు సరఫరా చేస్తున్నారు. వీటిని వ్యవసాయ హబ్‌ల నుంచి ఆయా గ్రామాల ఆర్బీకేలకు చేరుస్తున్నారు. వేరుశనగ విత్తనకాయలు అవసరమైన రైతులు బుధవారం నుంచి వారి పరిధిలోని ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏవో నాగప్రసాద్ తెలిపారు. 30 కిలోల కే-6 రకం బస్తా రూ.1,710, లేపాక్షి రకం 30 కిలోల బస్తా రూ.1566కు విక్రయిస్తారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా అధికారి కృష్ణయ్య

రాయచోటి టౌన్, మే 21: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా అధికారి కృష్ణయ్య తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14,415 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందులో 10,029 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం, 4,386 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్స్ ప్రకాశ్, అమరేంద్రకుమార్, నాగసురేశ్, ఎగ్జామినేషన్ సెంటర్స్ చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్సులు రాయచోటికి తరలింపు



పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కంటైనర్‌లో ఎక్కిస్తున్న రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్

మదనపల్లె టౌన్/తంబళ్లపల్లె, మే 21: మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో రాయచోటికి తరలించారు. స్థానిక ఉప ఖజానాలో భద్రపరచిన 11 పోస్టల్ బ్యాలెట్ బాక్సులను డీఎస్పీ ప్రసాదరెడ్డి సమక్షంలో పటిష్ట బందోబస్తు మధ్య మంగళవారం కంటైనర్‌లో రాయచోటికి తరలించారు. మదనపల్లెలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించగా మొత్తం 2,996 పోస్టల్ ఓట్లు పోలయ్యాయి. వీటితో పాటు డిఫెన్స్‌లో పనిచేసే వారికి, సుదూర ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగుల పోస్టల్ ఓట్లను రాయచోటికి పంపనున్నారు.

తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ జిల్లా కేంద్రం రాయచోటిలోని స్ట్రాంగ్‌రూంకు తరలించారు. ఈనెల 5వ నుంచి 9వ వరకు కురబలకోట, తంబళ్లపల్లె ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. ఈ పోస్టల్ బ్యాలెట్‌లను తంబళ్లపల్లె ఉపఖజానా అధికారి కార్యాలయం స్ట్రాంగ్ రూంలో భద్రపరచారు. మంగళవారం ఆర్వో రాఘవేంద్ర, ఏఆర్వో బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పోస్టల్ బ్యాలెట్లను ట్రెజరీలోని స్ట్రాంగ్ రూం నుంచి బయటకు తీసి ఎన్నికల అధికారుల సమక్షంలో సీల్ వేసి సీఐ మధు, ఎస్ శివకుమార్ ఆధ్వర్యంలో ఎస్కార్టుతో కంటైనర్ వాహనంలో రాయచోటిలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు.

లక్షలు వెచ్చించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని ప్రొద్దుటూరు రైతుబజారు
- కడపలో అసౌకర్యాలతో ప్రజల బేజారు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 21: జగన్ ప్రభుత్వంలో రైతుబజార్లు నిర్వీర్యమయ్యాయి. రైతులకు ఉపాధి, ప్రజలకు సౌకర్యవంతమైన మార్కెట్ సదుపాయం కల్పించేందుకు రైతుబజార్లు ఏర్పాటు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. ఒక పక్క టీడీపీ హయాంలో నిర్మించిన రైతు బజార్లను వినియోగించుకోకుండా వదిలేయడంతో పాటు ఇప్పటికే వినియోగంలో ఉన్న రైతుబజార్లను ఆధునీకరించడం కానీ, మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది.



నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి తేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న ప్రొద్దుటూరు రైతుబజారు

ప్రొద్దుటూరులో నిరుపయోగంగా..

ప్రజలకు సరసమైన ధరలకు తాజా కూరగాయలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రొద్దుటూరులోని మార్కెట్‌యార్డు ఆవరణలో రైతు బజారు నిర్మించింది. 2017 అక్టోబరు 20న అప్పటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ శాఖమంత్రి ఆదినారాయణ రెడ్డి కలిసి ప్రొద్దుటూరులో రైతు బజారుకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత పనులు పూర్తయినప్పటికీ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రైతు బజారును పూర్తిగా నిర్వీర్యం చేసింది. లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మారింది. ఆకతాయిలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో నిర్మించారనే కారణంతో ఈ రైతుబజారును వైసీపీ పాలకులు పూర్తిగా వదిలేశారు.

గతంలో ప్రొద్దుటూరు శివాలయం సెంటరులో కూరగాయల మార్కెట్ ఉండేది. వైసీపీ అధికారం చేపట్టాక అక్కడ షాపింగ్‌మాల్ నిర్మిస్తామంటూ మార్కెట్‌ను తొలగించారు. కొద్దికాలం పాటు వ్యాపారులు, రైతులు సరైన స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు కూడా ఈ రైతుబజారును ప్రారంభించలేదు. ఒకానొకసందర్భంలో పురపాలక సంఘం అధికారులు తాత్కాలిక మార్కెట్‌యార్డు పేరుతో రైతు బజారును పరిశీలించారు. కానీ అధికార పార్టీకి చెందిన నేతలు కేవలం అది టీడీపీ వారు నిర్మించారనే ఆలోచనతో పక్కనబెట్టినట్లు గతంలో చర్చ సాగింది. ఆ తరువాత మున్సిపల్ స్కూలు మైదానంలో కూరగాయల మార్కెట్‌కు షెడ్లు నిర్మించారు. దీంతో రైతు బజారు పూర్తిస్థాయిలో నిరుపయోగంగా మారింది. ప్రజలకు సంబంధించిన ఆస్తులను రాజకీయప్రయోజనాల కోసం వదిలివేయడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

కడపలో అసౌకర్యాల నడుమ..

కడప రైతు బజారులో ఉల్లి, కేరట్, టమోటా, బంగాళాదుంప, బీట్‌రూట్.. ఇలా ఏ కూరగాయ అయినా నాశిరకంగా ఉంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. నిత్యం వందలాది మంది కడప నగరంలోని రైతుబజారుకు వస్తుంటారు. కానీ జనాలకు తగినన్ని కనీస సౌకర్యాలు ఇక్కడ లేవు. తాగునీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. ఇక్కడ పరిశుభ్రత లేకపోవడంతో ఆర్వో ప్లాంటు ఉన్నప్పటికీ లేదనే విధంగా మారింది. మరుగుదొడ్ల విషయానికి వస్తే మూత్ర విసర్జనకు వెళ్లినా అధికంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. ఉమ్మడి ఏపీలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కడపలో ఏర్పాటు అయిన రైతుబజారుకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వర్షం వస్తే రైతుబజారు పూర్తిగా బురదమయం అవుతుంది.

పార్కింగ్ సమస్య

కడప రైతుబజారు వద్ద కూరగాయల కొనుగోలుకు వచ్చే వినియోగదారులు వాహనాలను పార్కింగ్ చేయాలంటే ఓ పెద్ద సమస్యగా మారుతోంది. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. జిల్లా పరిషత్ కార్యాలయం వైపు గతంలో ఖాళీగా ఉండేది. ఇప్పుడు అక్కడ కూడా భవన సముదాయాల నిర్మాణం జరగడంతో ఈ సమస్య మరింత జటిలమయ్యే అవకాశాలున్నాయి. రైతుబజారుకు వచ్చే ప్రజల కోసం వాహనపార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.



కనీస వసతుల్లేని కడప రైతుబజారు

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- సిబ్బందితో ఎస్పీ సిద్ధార్థ కౌశల్



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కమలాపురం రూరల్, మే 21: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తెలిపారు. కమలాపురం నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్షలో కౌంటింగ్ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎక్కడెక్కడ, ఎవరు, ఎలా విధులు నిర్వహించాలో ఆదేశాలిచ్చారు. జూన్ 1 నుంచి 6వ తేదీ వరకు ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే రాజకీయ నేతల గృహ నిర్బంధాలు, జిల్లా బహిష్కరణ అమలు చేస్తామని వివరించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కూడా నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కడప డీఎస్పీ షరీఫ్, నియోజకవర్గ నోడల్ అధికారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టరు రాజు, కమలాపురం సీఐ రామక్రిష్ణారెడ్డి, సీకేదిన్నె సీఐ శంకర్‌నాయక్, కడప రూరల్ సీఐ నాగరాజు, చెన్నూరు సీఐ పార్థసారధి, ఎస్ఐలు హృషికేశవరెడ్డి, వెంకటరమణ, వెంకటరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (నాగరాజుపేట), మే 21: టెంజింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయిగ్రేస్ తెలిపారు. కమిషనర్, యువజన సర్వీసుల శాఖ, విజయవాడ, కలెక్టరు ఆదేశాల మేరకు వివిధ సాహస కృత్యాలు చేసిన వారికి భూమి, నీటి, గాలిలో జీవిత సాఫల్య పురస్కారం కోసం అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా జూన్ 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మేనేజరు వీవీ సుబ్బరాయుడు, 9949298810, జూనియర్ అసిస్టెంటు టి.నాగయ్య 9849497011 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

న్యాయవ్యవస్థ తీర్పును లెక్క చేయని జగన్



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

కడప (సెవెన్‌రోడ్స్), మే 21: పదేళ్లలో నరేంద్రమోదీ ప్రభుత్వం, ఐదేళ్లలో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజలకు ఏ ఒక్క మంచిపని చేయలేదని, ప్రాజెక్టులు, పరిశ్రమలు నెలకొల్పలేదని చివరికి పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తారని చెప్పడం దారుణమన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను హైకోర్టు నిలుపుదల చేయాలని చెప్పినా జగన్ లెక్కచేయకుండా లక్షలాది భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేలా పాలసీ చేశారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందరెడ్డి, నగర కార్యదర్శి మద్దిలేటి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు న్యాయం జరగాలి

వైస్ చాన్సలర్ చింతా సుధాకర్



మూల్యాంకన కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ

కడప (ఎడ్యుకేషన్), మే 21: సమాధాన పత్రాలు దిద్దేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి ప్రతిభావంతులకు న్యాయం జరగాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అన్నారు. నిర్ణీత సమయంలో మూల్యాంకనం పూర్తి చేయాలన్నారు. మంగళవారం వైవీయూలో జరుగుతున్న మూల్యాంకన కేంద్రాలన్నీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మూల్యాంకన విధులకు వచ్చిన అధ్యాపకుల సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయానికి మూల్యాంకనం పూర్తి చేయాలని తద్వారా త్వరితగతిన ఫలితాలు ఇవ్వడం వలన విద్యాసంవత్సరం సరైన సమయంలో ప్రారంభమవుతుందన్నారు. విధులకు ఎంపికైన ప్రతి అధ్యాపకుడు రోజూ సకాలంలో హాజరు కావాలని సూచించారు.

బాధితులకు న్యాయం చేస్తాం

భారీవాహనాలు పట్టణంలోకి రాకుండా చర్యలు : ఆర్డీవో



దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న ఆర్డీవో

ముద్దనూరు మే 21: సిమెంట్ లోడు లారీ ఈనెల 17వ తేదీ రాత్రి స్థానిక విజయలక్ష్మి ఇంటిలోకి దూసుకు వెళ్లిన విషయం అందరికీ విధితమే. కాగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చర్యలు చేపడతామని ఆర్డీవో శ్రీనివాసులు హామీ ఇచ్చారు. విజయలక్ష్మి ఇంటిలో డ్వాక్రా గ్రూపు నుంచి లోన్ తీసుకుని దుస్తులు, ఫ్యాన్సీ దుకాణం నడుపుతోంది. లారీ ఢీకొనడంతో ఇంటి మూడు రూములు, దుకాణంలోని వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈప్రమాదంలో ప్రక్కనే ఉన్న అక్బర్ బాషా,సుధాకర్ ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ దస్తగిరి, ఎంవీఐ ప్రసాద్, ఆర్‌అండ్‌బీ, రెవిన్యూ అధికారులు దెబ్బతిన్న ఇళ్లను, దుకాణాన్ని మంగళవారం పరిశీలించారు. ఇళ్లు చాలా ప్రమాదకరంగా ఉందని ఇంటి వద్దకు ఎవరూ వెళ్లవద్దన్నారు. అనంతరం ఆర్డీవో బాధితులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడుసార్లు లారీ తగలడంతో ఆర్థికంగా నష్టపోయామన్నారు. ప్రమాదం జరిగిన లారీ, చనిపోయిన డ్రైవర్‌కు, సిమెంట్‌కు ఇన్సూరెన్స్ వస్తుందని, ఇళ్లు పడిపోయి ఆస్తినష్టం జరిగిన మాకు ఎటువంటి ఆర్థిక సహాయం అందడంలేదన్నారు. మూడుసార్లు సొంత ఖర్చులతో ఇల్లు మరమ్మతులు చేసుకున్నామన్నారు. కాగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీవో తెలిపారు.

9 నెమళ్లు మృత్యువాత



పెద్దముడియం, మే 21 : మండల పరిధిలోని నెమళ్లదిన్నె శివారులో మంగళవారం 9 నెమళ్లు మృత్యువాత పడ్డాయి. స్థానికులు, పోలీసులు అటవీశాఖ అధికారుల వివరాల మేరకు.. నెమళ్లదిన్నె, ఉప్పలూరు గ్రామాల మధ్య కేసీ కాల్వ, కుందూ నది మధ్యలో ఉన్న ఓ వంక వద్ద నెమళ్లు ఓ కుప్పగా మృత్యువాత పడి దర్శనమిచ్చాయి. స్థానికులు గమనించి ఈ సమాచారం పెద్దముడియం పోలీసులకు అందించారు. వారు సంఘటనాస్థలాన్ని చేరుకుని నెమళ్లు మృతి చెందిన పరిస్థితిని గమనించి ఈ విషయం అటవీ శాఖాధికారులకు తెలిపారు. వెంటనే ముద్దనూరు అటవీ శాఖ అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతి చెందిన నెమళ్లను పరిశీలించి వైద్యాధికారులచే పోస్టుమార్టం నిర్వహించారు. అయితే నెమళ్ల మృతికి కలుషిత నీరే కారణమై ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అయితే ఒకేచోట 9 నెమళ్లు మృత్యువాత పడడంతో ఈ సంఘటన చర్చనీయాంశమైంది. అయితే ఇందులో ఎలాంటి కోణం లేదని కలుషిత నీరు, వాతావరణ మార్పుల కారణంగానే నెమళ్లు మృతి చెంది ఉండవచ్చని అటవీ, పశువైద్యాధికారులు అంచనా వేశారు. పోస్టుమార్టం తరువాత స్థానికంగానే నెమళ్లను ఖననం చేశారు.

'కోన'లో పెంచులోరి వైభోగం

- స్వర్ణ హనుమంతుడిపై భక్తులకు దర్శనం



సరస్వతీదేవి అలంకరణలో ఊరేగుతున్న శ్రీవారు

రాపూరు (డక్కిలి), మే 21 : పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం సరస్వతీదేవి అలంకరణలో శ్రీవారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా అలంకార మండపంలో స్వామివారిని విశేషంగా తీర్చిదిద్ది హంస వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణలతో కోన క్షేత్రం మారుమోగింది. ఆ తర్వాత ఊంజల్ సేవ, తిరుమంజనం సేవలు జరిగాయి. వివిధ సేవలతో అలసిన శ్రీవారిని సేదతీర్చేందుకు అర్చకులు స్నపన, తిరుమంజనం జరిపించారు. దేవదేవుళ్ల ఉత్సవ విగ్రహాలను పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పళ్లరసాలు, చందనం, పసుపు, కొబ్బరి నీటితో అభిషేకించారు.

హనుమపై వైభోగం

శ్రీరామచంద్రుడి అలంకారంలో ముస్తాబైన నృసింహ స్వామి రాత్రి బంగారు హనుమంతుడిపై విహరించారు. మాడవీదుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ఏసీ సాగర్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు గరుడవాహన సేవ

బుధవారం నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారు తనకిష్టమైన స్వర్ణగరుడ వాహనంపై విహరించనున్నారు. ఈ వేడుకలను తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు 120కి పైగా బస్సులను తిప్పనున్నారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్టు

మైదుకూరు, మే 21 : ఖాజీపేట మండలం పుల్లూరులో పోలింగ్ రోజున జరిగిన దాడి కేసులో వైసీపీకి చెందిన ఐదుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 13న పుల్లూరులో హరిజనవాడకు చెందిన టీడీపీ కార్యకర్త జి.చిన్నయ్య ఇంటికి వెళ్తుండగా రహ్మత్‌ఖాన్ పల్లెకు చెందిన ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డితో పాటు మరో నలుగురు కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని, తీవ్ర రక్త గాయాలయ్యాయని చెన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎస్పీ వెంకటేసులు విచారణ జరిపి మంగళవారం ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డితో పాటు మరో నలుగురిని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచారు. కాగా కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేసులు తెలిపారు.

ఆగి వున్న లారీని ఢీకొన్న కారు

- ఐదుగురికి తీవ్రగాయాలు
- గాయపడిన వారు హైదరాబాదు వాసులు



తీవ్రంగా గాయపడ్డ రేణుకారెడ్డి, గాయపడ్డ సుఖేందర్‌రెడ్డి

రైల్వేకోడూరు, మే 21 : మండలంలోని రాఘవరాజపురం గ్రామ సమీపంలో వున్న ఓ పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం ఆగి వున్న లారీని కారు ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. హైదరాబాదుకు చెందిన ఒకే కుటుంబం వారు ఆదివారం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో రైల్వేకోడూరు మీదుగా వెళ్తుండగా రాఘవరాజపురం వద్ద ఓ పెట్రోల్ బంకు ఎదురుగా ప్రధాన రహదారిలో ఆగి వున్న లారీని కారు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సుఖేందర్‌రెడ్డి, రాందేవి, దీక్షిత్‌రెడ్డి, రేణుకారెడ్డి, మోహిత్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న రాఘవరాజపురం గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అసాంఘిక శక్తుల అడ్డాగా పులివెందుల

మామిడిచెట్లను నరకడం అమానుషం : తులసిరెడ్డి



మారెళ్లమడకలో మామిడిచెట్లను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

చక్రాయపేట, మే 21: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం అసాంఘికశక్తుల అడ్డాగా మారిందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. పులివెందుల నియోజకవర్గం, చక్రాయపేట మండలం, మారెళ్లమడక వాసులు బొజ్జా పార్థసారధి రెడ్డి, వాసుదేవరెడ్డి, యోగాంజులరెడ్డిలకు చెందిన మామిడి తోటలో 120మామిడిచెట్లను గుర్తుతెలియని దుండగులు నరికారన్నారు. దాదాపు రూ.8లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. మంగళవారం మామిచెట్లను తులసిరెడ్డి పరిశీలించి ఆవేదన చెందారు. ఇది చాలా దుర్మార్గమైన, అమానుషమైన చర్య అన్నారు. దుండగులను తక్షణం గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆర్థికసాయం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, వేమయ్య, రాజు పాల్గొన్నారు.

వైభవంగా నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెద్ద శేష వాహనంపై నారాపుర వెంకటేశ్వరస్వామి, గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న మహిళలు

జమ్మలమడుగు మే21 : జమ్మలమడుగులో శ్రీనారాపురం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగ్లవారం రెండవ రోజు ఆలయ ప్రాంగణంలో భక్తులకు పండితులు అధికారుల మధ్య ధ్వజారోహణ చతుష్టార్చన కార్యక్రమం జరిగింది .అనంతరం బేరితాడనం దేవతహం ఆస్థానం సాయంత్రం ఊంజల సేవ అన్నమాచార్యుల కీర్తన లు రాత్రి పెద్దశేష వాహనంలో ఊరేగింపు .జరుగుతుందన్నారు.

దిగుబడి రాక... ధరల్లేక


ఎక్స్‌కవేటర్‌తో మామిడి చెట్లను తొలగిస్తున్న రైతులు

- నష్టాలబాటలో మామిడి రైతులు
- చేసేది లేక చెట్లను నరికేస్తున్న వైనం

చిట్వేలి, మే 21: రైల్వేకోడూరు నియోజకవర్గంలో మామిడి రైతులకు గడ్డుకాలం వచ్చింది. పండ్లలో రారాజుగా వున్న మామిడితోటలు ఒకప్పుడు సిరులు కురిపించగా.. నేడు సరైన దిగుబడి రాక.. ధరల్లేక రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. చిట్వేలిలో వరస నష్టాలతో విసిగిపోయిన రైతన్నలు మామిడి చెట్లను నరికి ఇటుకల బట్టీలకు, పవర్ జనరేట్ బట్టీలకు తరలిస్తున్నారు. గతంలో అధిక దిగుబడి వుండటంతో మామిడికి గిరాకీ బాగా ఉండేది. కోడూరులోని మామిడి గోడౌన్ల నుంచి రాజస్థాన్, ఢిల్లీ, చత్తీస్‌గడ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు సాగేవి. సీజన్ ప్రారంభానికి ముందు బయట రాష్ట్రాల నుంచి వ్యాపారస్తులు వచ్చి ఒప్పందాలు చేసుకునేవారు. మామిడిలో మంచి ఆదాయం వుండటంతో రైతులు విస్తారంగా సాగు చేపట్టారు. అధిక దిగుబడులు ఆశించిన రైతులు మామిడి తోటలకు రసాయనిక ఎరువులు పురుగుల మందులు వాడటం ప్రారంభించారు. దీంతో మొదట్లో అధిక దిగుబడులు రావడంతో లాభాలు గడించారు. కాలక్రమేణ వాతావరణ పరిస్థితులు, రసాయనిక ఎరువులు ప్రభావం, చీడపీడలు, తెగుళ్ల కారణంగా నాణ్యతతో పాటు దిగుబడి పూర్తిగా తగ్గిపోయి రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు. దీనికితోడు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మామిడి పునరుద్ధరణ పథకం కింద రైతులకు హెక్టార్‌కు రూ.17,500లు ప్రోత్సాహక నగదు అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇవన్నీ రద్దయ్యాయి. ఫలితంగా రైతులు చేసేది లేక మామిడి చెట్లను తొలగిస్తున్నారు. మండలంలో ప్రస్తుతం 4200 ఎకరాలలో మామిడి తోటలు ఉండగా...దిగుబడి లేని కారణంగా నాలు గైదు వందల ఎకరాల్లో మామిడి చెట్లను రైతులు నరికేస్తున్నారు. 10 సంవత్సరాలు బిడ్డల్లా పెంచుకున్న చెట్లను చేతులారా నరికివేయాల్సిన పరిస్థితి రావడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మామిడి సాగులో నష్టాలపాలైన రైతులు ఉద్యాన పంటలపై మక్కువ చూపుతున్నారు. బొప్పాయి, అరటి పంటలు సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.


మామిడి చెట్లను తొలగించి చదును చేసిన పొలం

దివ్యాంగులను బడిబాట పట్టించేందుకు ప్రత్యేక సర్వే

గాలివీడు, మే 21: దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర, జిల్లా సంచాలకుల ఆదేశానుసారం ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం ఐఈఆర్‌పీలు ఖలందర్, కృష్ణవేణిలు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వారు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాటాడుతూ జూన్ 9 వరకు సాగే ఈ సర్వే మండల విద్యాశాఖాధికారులు నాగరాజు, శ్రీనివాసులు పర్యవేక్షణలో సాగుతుందన్నారు. ఈ ఇంటింటి సర్వే ద్వారా చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు పాఠశా లల్లో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారిని గుర్తించి చదువు వలన కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయల గురించి తల్లిదండ్రులకు వివరించి... వారి పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.


గాలివీడులో దివ్యాంగుడి ఇంటి వద్ద వివరాలు నమోదు చేస్తున్న ఐఈఆర్‌పీలు

అల్లర్లకు పాల్పడితే జైలు తప్పదు : సీఐ


చౌటపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె, మే 21: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే జైలు పాలవుతారని సీఐ జీవన్ గంగనాధబాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చౌటపల్లి, అనంతపురం, ఈడిగపల్లె, వడ్డెపల్లె, వెనమలవాండ్లపల్లె గ్రామాల్లో బీఎస్ఎఫ్ పోలీసులచే కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చిన్న చిన్న గొడవలకు పాల్పడినా వాటిని పెద్దవి చేయకుండా సర్దుకుపోవాలని తెలియజేశారు. రాత్రి వేళల్లో మద్యం సేవించి ఒకరిపై ఒకరు దూషించుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు శాంతియుతంగా గ్రామాల్లో మెలగాలని సూచించారు. ఏవైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్ర మంలో బీఎస్ఎఫ్ బెటాలియన్ పోలీసు సిబ్బది పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోండి

రామాపురం, మే 21: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తనపు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. మండలానికి కే-6 రకం 550 క్వింటాళ్లు, నారాయణి 790 క్వింటాళ్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఒక బస్తా (30 కిలోలు) కే-6 రకం పూర్తి ధర రూ.2850 కాగా సబ్సిడీ పోను రైతుకు రూ.1710 అందజే స్తామన్నారు. నారాయణి రూ. 2910లు కాగా సబ్సిడీ పోను రైతు వాట 1746 రూపాయలు చెల్లించాల్సి ఉంటుం దని ఆమె తెలిపారు. రైతు పొలం విస్తీర్ణాన్ని బట్టి కాయల పంపిణీ ఉంటుం దని 0.5 ఉంటే ఒక బస్తా, 0.51 ఎకరాల నుంచి ఒక ఎకరా వరకు ఉంటే 2 బస్తాలు, గరిష్ఠంగా మూడు బస్తాలు పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులందరూ సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

'వైసీపీ పతనం కోసం ఎదురు చూస్తున్నారు'

చిట్వేలి, మే 21: వైసీపీ పతనాన్ని చూసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని మండల జనసేన నాయకుడు మాదాసు నరసింహ ఆరోపించారు. సోమవారం చిట్వేలిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతల ప్రకటనలన్నీ మేకపోతు గాంభీర్యమన్నారు. నిరుత్సాహంతో మునిగిపోయిన కార్యకర్తల్లో మనోధైర్యం నింపేందుకు వైసీపీ నేతలు దింపుడు కల్లెం ఆశలు రేపుతున్నారన్నారు. అయిదేళ్ల వైసీపీ అరాచక పాలన అంతానికి రికార్డుస్థాయిలో ఓటింగులో పాల్గొన్న ప్రజలే నిదర్శనమన్నారు. జూన్ 4న విజయోత్సవ సంబరాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలంటూ నరసింహ పిలుపునిచ్చారు.

కమనీయం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

సుండుపల్లె, మే 21: మండలంలోని పెద్దినేనికాల్వ గ్రామ పంచాయతీ బేరిపల్లె సమీపంలో వెలిసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మేళ తాళాలతో ముస్తాబు చేసిన కల్యాణ వేదికపై లక్ష్మి నరసింహస్వామిని ఆశీనులను చేశారు. సాంప్రదాయబద్దంగా ఉదయం 9 నుంచి కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. హాజరైన భక్తులకు గ్రామానికి గూడూరు ఓబులు, అనసూయమ్మ కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణ వేదికపై ఆశీనులైన లక్ష్మీనరసింహస్వామి

నేడు నరసింహస్వామి తిరుణాల

పొలిమేరపల్లె గ్రామ పంచాయతీ నగిరిలో బుధవారం నుంచి లక్ష్మినరసింహస్వామి వారి వార్షిక తిరుణాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం మహాగణపతిపూజ, రక్షాబంధనం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గురువారం ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అగ్నిగుండ ప్రతిష్ఠ, గణపతి హోమం, నవగ్రహోమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.

నాగారపమ్మ జాతర తేదీల ఖరారు

జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన జాతరల్లో ఒకటైన మండలంలోని పెద్దినేని కాలువ గ్రామం బండకాడ ఈడిగపల్లెలోని నాగారపమ్మ జాతర తేదీలను ఖరారు చేసినట్లు ఆలయ ధర్మకర్త కృష్ణమూర్తినాయుడు తెలిపారు. జూన్ 15, 16, 17 తేదీల్లో జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొక్కులు ఉన్న వారు చాందినీ బండ్లు కట్టుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సుండుపల్లె, మే 21: మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీలో వెలిసిన ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం తిరుణాల ఉత్సవాల్లో భాగంగా అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఏడాది ఎంతో భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు ఆంజేయస్వామి తిరుణాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బుధవారం రాత్రి రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు ప్రదర్శన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణ మహోత్సవం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

లక్కిరెడ్డిపల్లె, మే 21: మండలంలోని చౌటపల్లె పంచాయతీలోని రవీంద్ర నగర్‌లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వెంకట నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో గాండ్లపల్లికి చెందిన కుర్నూతల కృష్ణ, నాగేం ద్ర కుటుంబ సభ్యులు స్వామి వారికి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తాదులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని లల్లూ యాదవ్ ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. చెక్కభజన, కోలాటం, డీజే కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గోపగుడిపల్లిలో జయంతి ఉత్సవాలు

రామాపురం, మే 21: మండలంలోని గోపగుడిపల్లె పంచా యతీలోని వెలిసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి జయంతి ఉత్సవాలను బుధ వారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉద యం సుప్రభాత సేవ, మహాగణపతిపూజ స్వస్తివాచనం పంచామృత అభిషేకాలతో పూజలు, జపాలు, హోమాలు నిర్వహిస్తారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రైతాంగ ఉద్యమ నేత ఆశయాలను కొనసాగిద్దాం


కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

రాయచోటిటౌన్, మే 21: రైతాంగ, కమ్యూనిస్టు ఉద్యమ నేత కొల్లి నాగేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు పిలుపు నిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ఆధ్వర్యంలో కొల్లి నాగేశ్వరరావు నాల్గవ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నరసింహులు మాట్లాడుతూ నాగేశ్వరరావు నదీ జలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హక్కులు, సాగునీటి పారుదల ప్రాజెక్టుల సాధనపై అవి రళంగా కృషి చేశారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా నదీ జలాల సమస్య సంక్లిష్టంగా మారింది. ఈనేపథ్యంలో కృష్ణానది జలాలు, ఆంధ్రప్రదేశ్ హక్కులకు సంబంధించిన అంశాలపై సీపీఐ పోరాటం చేస్తోందని, కొల్లి నాగేశ్వరరావు ఆశయాలను ముందుకు తీసుకువెళతామని తెలిపారు. ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాధనాయక్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సుధీర్‌కుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనాథ శవంకు అంత్యక్రియలు

రైల్వేకోడూరు, మే 21: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అనాథ వృద్ధుడు తీవ్ర అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసు కున్న పట్టణ కాపు నాయకులు చెన్నంశెట్టి రమేష్‌బాబు, మండల నాగేంద్రలు అక్కడకు వెళ్లి అనాథ శవాన్ని శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలో ఎవరైనా అనాథలు చనిపోతే తాము అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


గాలివీడులో రక్తదాన శిబిరంలో పాల్గొన్న తహసీల్దార్, ఎస్ఐలు

గాలివీడు, మే 21: అన్నింటికంటే రక్తదానం గొప్పదని.. రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గాలివీడులో మంగళవారం దీపా బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో అక్షిత సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్ఐ వెంకటప్రసాద్, వైద్యులు రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువత పెద్ద ఎత్తున రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారిని కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో అక్షిత సొసైటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, వీఆర్‌వో అల్లాబకస్, స్థానిక వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీ


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్

రామాపురం, మే 21: రామాపురంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఉమ్మడి కడప జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరాలను పరిశీలించారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మేగజైన్లు, దినపత్రికలు, వారపత్రికలు అందు బాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాల యాలకు వచ్చి పుస్తకాలు చదివితే జ్ఞానాన్ని పెంపొం దించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పిల్లలకు పుస్తక పఠనం

రైల్వేకోడూరు, మే 21 : పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంపులో భాగంగా పిల్లలకు పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రమణ్యంశర్మ మాట్లాడుతూ గ్రంథాలయంలో వున్న పుస్తకాలను చదవడం పట్ల పిల్లలకు మంచి అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసులు, పిల్లలు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు


కాలభైరవస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నదృశ్యం

రాయచోటిటౌన్, మే21: రాయచోటి మండల పరిధిలోని యండపల్లె గ్రామం ముసలిరెడ్డిగారిపల్లెకు సమీపంలో భైరవగుట్టపై వెలిసిన కాలభైరవస్వామి తిరుణాల సందర్భంగా మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కాలభైరవస్వామి ఉత్సవ విగ్రహాలకు గాలివీడు మండలం వెలిగల్లు సమీపంలోని గండిమడుగులో పసుపు, కుంకుమలతో అభిషేకాలతో నిర్వహించారు. మూడు రోజులుగా యండపల్లె గ్రామ పంచాయతీలో కాలభైరస్వామి విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగానే మంగళవారం సాయంత్రం గండిమడుగులో అభిషేకాలు చేసి ఆలయానికి తీసుకొచ్చారు. అలాగే బుధ, గురు, శుక్రవారాల్లో అత్యంత వైభవంగా కాలభైరవ స్వామి తిరుణాల ఉత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు జరగనున్నాయి.

తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి


11వ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

రాయచోటిటౌన్, మే21: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆంధ్రప్రదేశ్ మహిళా సమఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్రతో కలిసి 11వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు నెలలుగా వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా వచ్చే నీళ్లు సకాలంలో రాక తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రజలను పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తాగునీటి సమస్యపై విన్నవించి నప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. వారం రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇటువైపు ఎవరు రాలేదన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏపీ మహిళా సమాఖ్య పట్టణ నాయకురాలు నసీబ్‌జాన్, సీపీఐ పట్టణ నాయకులు చలపి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

చక్రాయపేట, మే 21: గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం అందించినట్లు ఆలయ ఏసీ ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. కొండాపురం మండలం తాళ్ళప్రొద్దుటూరుకు చెందిన రెండెద్దుల నాగేశ్వరరెడ్డి ధర్మపత్ని సతీదేవి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

కడప (మారుతీనగర్) మే 21: దళితుల్లో సామాజిక చైతన్యం తీసుకురావాలనే ఏకైక లక్ష్యంతో అనంతపురం జిల్లా పామిడి మండలంలో అక్టోబర్ 7న తలపెట్టిన దళిత మిత్రసంఘం రాష్ట్ర మహాసభలను దిగ్విజయం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దళితులు తరలిరావాలని రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజనేయులు పిలుపు నిచ్చారు. మంగళవారం అంబేడ్కర్ నగర్‌లోని దళిత మిత్ర సంఘం కార్యాలయంలో చేపట్టిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించిన ఆయ న మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వివిధ స్థాయిల్లో కమిటీలను పూర్తిచేశామన్నారు. ఆ కమిటీల ద్వారా కొన్ని సమస్యలను తీర్చినట్లు స్పష్టం చేశారు.



వేడుకగా తిరుపతి జాతర

● వజ్రకిరీటంలో వెలిగిపోయిన గంగమ్మ
● నేడు విశ్వరూప దర్శనం

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఊరంతా జాతర చేసుకుంది. అమ్మలగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లింది. అంబళ్లు పోసి తాపం తీర్చింది. కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని కళ్లకద్దుకుని భక్తి పారవశ్యంతో చిందేసింది.వారం పాటు రోజుకో అలంకరణతో దర్శనమిచ్చిన తాతయ్యగుంట గంగమ్మకు మంగళవారం ఉదయాత్పూర్వం మహాభిషేకం చేసి శాంతింపజేశారు. స్వల్ప తోపులాట మినహా మహాభిషేక కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. సర్వాలంకారశోభితురాలైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు.అభిషేకానంతర దర్శనం మొదలుకొని నిర్విరామంగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు పొర్లుదండాలు, అడుగడుగు దండాలు పెట్టుకుంటూ, వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.టీపీ ఏరియాలోని తాళ్లపాక పెదగంగమ్మ, చింతల చేనులోని ముత్యాలమ్మ, దాసరిమఠంలోని మాతమ్మ, పల్లెవీధిలోని వేశాలమ్మ, చింతకాయవీధిలోని కరిమాను గంగమ్మలతోపాటు నగరంలో వున్న చిన్న గంగమ్మ ఆలయాల్లో కూడా జాతర సంబరాలు అంబరాన్నంటాయి.మంగళవారం భక్తులు పలు పౌరాణిక, జానపద వేషాలు ధరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. గత ఏడాదికన్నా ఈసారి సప్పరాలు ధరించిన భక్తులు పెద్దఎత్తున కనిపించారు. నగరంలో ఎక్కడ చూసినా అంబళ్ల పంపిణీ, అన్నదాన వితరణ కార్యక్రమాలు విరివిగా జరిగాయి.మంగళవారం అర్ధరాత్రి తర్వాత విశ్వరూప స్నాపానికి అమ్మవారి విశ్వరూపం తయారు చేయడం మొదలుటపెట్టారు. బుధవారం తెల్లవారుజామున చెంపనరుకుడుతో గంగజాతర పరిసమాప్తి కానుంది.

విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా

పాలసముద్రం, మే 21: మండలంలోని పాలసముద్రం, వెంగళరాజు కుప్పం, వనదుర్గాపురం, నరసింహాపురం అటవీ ప్రాంతాలకు సమీపంలోని చెరువులు, అక్కడి నుంచి వచ్చే కాలువల్లో వున్న ఇసుకను గత వారం రోజులుగా విచ్చలవిడిగా కొందరు ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లోని ట్రాక్టర్ ఇసుకను రూ.3500 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నికల అనంతరం పాలసముద్రం ఎస్ఐకి చిత్తూరులోని కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు డ్యూటీ వేయడంతో ఇక్కడ కొంతమంది వైసీపీ నాయకులు ట్రాక్టర్ల ద్వారా అటవీ ప్రాంతాలు, చెరువుల్లో ఇసుకను విక్రయించి పబ్బం గడుపుకుంటున్నారు. అడ్డదారుల్లో తమిళనాడుకు తరలించేస్తున్నారు. పోలీసులు, ఫారెస్టు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా జరుగుతోంది. కాలువల్లో ఉన్న ఇసుకను తీసివేయడం వల్ల భూగర్భజలాల మట్టం తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిత్తూరులో రెండు రోజులు మద్యం దుకాణాల బంద్

చిత్తూరు సిటీ, మే 21: గంగజాతర సందర్భంగా మంగళ, బుధవారాల్లో చిత్తూరులో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతవేస్తున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ ఆయేషా బేగం చెప్పారు. గంగమ్మ జాతర సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. నగర పరిధిలోని 14 మద్యం దుకాణాలు, 7 బార్లు, ఒక ఎలైట్ స్టోర్, ఒక మిలిటరీ క్యాంటీన్‌ను ఈ రెండు రోజులు మూసివేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు: బీసీవై



చిత్తూరు సిటీ, మే 21: తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆరోపించారు. ఇటీవల పుంగనూరు నియోజకవర్గంలో బీసీవై పార్టీ శ్రేణులపై వైసీపీ నేతలు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి చిత్తూరులోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బీసీవై నేతలు, కార్యకర్తలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో వైసీపీ గూండాలు తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేశారన్నారు. కానీ, పోలీసులు దెబ్బలు తిన్న వారిపైనే కేసులు పెట్టడం దారుణమన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పుంగనూరు నియోజకవర్గంలోని పోలీసులు పూర్తిగా మంత్రి పెద్దిరెడ్డికి సహకరించారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపైన ఐదేళ్లుగా తప్పుడు కేసులు బనాయించి వారిని భయాందోళనకు గురిచేస్తున్నారని చెప్పారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత కూడా పోలీసులు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఈ సంఘటనలపై న్యాయపోరాటం చేస్తామని ఆయన చెప్పారు.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు ఏసీ కోచ్‌లు

తిరుపతి(సెంట్రల్), మే 21: తిరుపతి- లింగంపల్లి- ముంబాయి మధ్య నడుస్తున్న నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ల(12733-12734, 17057-17058)కు అదనంగా రెండు 3ఏసీ కోచ్‌ను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 27వ తేదీవరకు ఈ అదనపు కోచ్‌లు ఉంటాయన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

కౌంటింగు నాడు అల్లర్ల ముప్పు?
ఇంటెలిజన్స్ హెచ్చరికలతో అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), మే 21: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగు రోజు, మరుసటి దినం జిల్లాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. అదే తరహాలో జూన్ 4వతేది ఓట్ల లెక్కింపు రోజున కూడా అల్లర్లు జరిగే అవకాశం వుందని ఇంటెలిజన్స్ వర్గాలు హెచ్చరించాయి.ప్రధానంగా చంద్రగిరి నియోజకవర్గంలోని కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, నడవలూరు, రామాపురం, బ్రాహ్మణకాల్వ, నెన్నూరు గ్రామాలతో పాటు తిరుపతిలోని ఎస్టీవీ నగర్, చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ నగర్, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో అల్లర్ల ముప్పు పొంచి ఉన్నట్లు హెచ్చరించడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అల్లర్లకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయడంతో పాటు రౌడీషీటర్లను, పాత నేరస్తులను బైండోవర్ చేయించే పనిలోపడింది.కౌంటింగ్ పూర్తయిన వారం రోజుల పాటు ఈ పికెట్లు కొనసాగిస్తామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. అల్లర్లు జరిగే ప్రాంతాలకు త్వరితగతిన చేరుకునేందుకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన నాలుగు మొబైల్ క్విక్ రెస్పాన్స్ టీములను సిద్ధం చేశారు. మరో వైపు ఎన్నికల ఫలితాలు వచ్చాక విజయోత్సవ ర్యాలీలపై నిషేధం విధించారు.

ఘనంగా తరిగొండ వెంగమాంబ జయంతి



వెంగమాంబ చిత్రపటానికి పుష్పాంజలి

తిరుపతి (కల్చరల్), మే 21: అన్నమాచార్య కళామందిరంలో వెంగమాంబ జయంతి వేడుకలు మంగళవారం మొదలయ్యాయి. ప్రారంభ సభలో పాల్గొన్న టీటీడీ జేఈవో గౌతమి మాట్లాడుతూ.. శ్రీవారిని సేవించిన వెంగమాంబ మనకు ఎనలేని సాహితీ సంపదను అందించారని చెప్పారు. అనంతరం జరిగిన సాహితీ సభకు విశ్రాంత వీసీ ఆచార్య కుసుమ కుమారి అధ్యక్షత వహించగా, పలు అంశాలపై ఎస్వీబీసీ అధ్యక్షుడు సాయికృష్ణయాచేంద్ర, నెల్లూరుకు చెందిన సాహితీవేత్త డాక్టర్ లోకేశ్వరి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ ప్రసంగించారు. సాయంత్రం సాయికృష్ణ యాచేంద్ర ఆధ్వర్యంలో వెంగమాంబ సంగీత గేయధార జరిగింది.

నేడు తిరుమలలో జయంత్యుత్సవాలు

తిరుమల, ఆంధ్రజ్యోతి: వెంగమాంబ జయంత్యుత్సవాలు బుధవారం తిరుమలలో వైభవంగా జరగనున్నాయి. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారిణి బుల్లెమ్మ బృందం వెంగమాంబ సంకీర్తనలు ఆలపించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం.. 7 గంటలకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద అనుగ్రహభాషణం చేస్తారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసులు పెట్టాలి : జేసీ

తవణంపల్లె/పూతలపట్టు, మే 21: నదులు, వంకలు, వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించే వారిపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు కేసులు పెట్టాలని జేసీ పి.శ్రీనివాసులు సూచించారు. తవణంపల్లె మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె వద్ద బాహుదానదిలో, పూతలపట్టు మండల వావిల్‌తోట వద్ద నీవానదిలోని ఇసుక రీచ్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. గతంలో ఇసుక రీచ్‌లకు ఇచ్చిన అనుమతులు గడువు ముగిసిందని, ఇక ఎవరైనా ఇసుకను తరలిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు రెండు సార్లు ఇసుక రీచ్‌లను స్థానిక అధికారులు పరిశీలించాలన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలపై ఉందన్నారు. అలాగే, వంకలు, వాగులు, నదుల్లో వేస్టేజీ వేయనీకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్‌చార్జి, ఏఎస్పీ సుబ్బరాజు, భూగర్భ గనులశాఖ డీడీ కెఎల్‌ఎం ప్రసాద్, జియాలజిస్టు పోలిరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరబ్రాహ్మణపల్లెలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ

నడింపల్లెలో అతిసార

ఆస్పత్రికి పరుగు తీసిన బాధితులు ● గ్రామంలో వైద్య శిబిరం



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి చికిత్సలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

శాంతిపురం, మే 21 : శాంతిపురం మండలం నడింపల్లె గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం పలువురు అస్వస్థతకు గురయ్యారు. కుప్పం గంగజాతరకు వెళ్లే హడావిడిలో ఉన్న పలువురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఒకరిద్దరికే అనుకుని ఎవరూ పెద్దగా పటించుకోలేదు. కొంతసేపు గడిచాక మరికొందరికీ వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో బాధితులు భయపడి కుప్పం ప్రైవేటు ఆస్పత్రికి కొందరు, శాంతిపురంలోని ప్రభుత్వాస్పత్రికి మరికొందరు వెళ్లారు. శాంతిపురంలో కృష్ణమూర్తి, గోవిందప్ప, రవి, క్రిష్ణప్ప, ఎల్లమ్మ, కదిరమ్మ, మునెమ్మ, గోపాల్ తదితరులు చికిత్స పొందారు. ఎటువంటి ప్రమాదము లేదని తెలియడంతో ఇళ్లకు చేరుకున్నారు. గ్రామంలో అతిసారం విషయం తెలిసి రాళ్ళబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అస్వస్థతకు గురైన వారిని డాక్టర్లు పలకరించి చికిత్స అందించారు. సర్పంచి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేశారు. తాగునీటిని పరీక్ష తిరుపతి ల్యాబ్‌కు పంపినట్లు సర్పంచి తెలిపారు. చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది గ్రామంలో పర్యటించారు. బాధితులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

పల్లెల్లో ఏనుగుల బీభత్సం





ఏనుగులు విరిచేసిన మామిడిచెట్లు - ధ్వంసం చేసిన రాతి కూసాలను చూపుతున్న రైతు

కల్లూరు, మే 21: పులిచెర్ల మండలంలోని కల్లూరు, పాళెం, దేవళంపేట పంచాయతీల్లో సోమవారం రాత్రి పంటపొలాలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. మామిడి, కొబ్బరి, అరటి, పశుగ్రాసం తదితర పంటలకు అపార నష్టం కలిగించాయి. సోమవారం రాత్రి అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు కల్లూరు సమీపంలోని ఎద్దులవారిపల్లి వద్దకు చేరుకుని లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, సారధికి చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు 5 టన్నుల మామిడికాయలను నేలరాల్చాయి. అక్కడి నుంచి కోటపల్లి సమీపానికి చేరుకున్న ఏనుగులు యుగంధర్‌కు చెందిన మామిడిచెట్లను, తోట ఇనుప కూసాలను ధ్వంసం చేశాయి. అనంతరం కుమ్మరిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు చంద్రబాబుకు చెందిన మామిడి, కొబ్బరి, అరటి పంటలను విరిచేశాయి. అక్కడి నుంచి కొక్కువారిపల్లి వద్దకు చేరుకుని.. సరస్వతమ్మ, వీకే పల్లికి చెందిన సురేంద్ర, ఎంఎం రాచపల్లికి చెందిన జగన్‌కు చెందిన తోటల్లోని మామిడిచెట్లను విరిచాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బాధిత రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చి

సూళ్లూరుపేటలో రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం



ఎ.రంగంపేటలోని ఓ ఇంట్లో సోదాలు

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం పలు చోట్ల పోలీసులు కార్డన్ సెర్చి పేరిట తనిఖీలు చేపట్టారు. గత 13వ తేదీన పోలింగ్ రోజు, మరుసటి రోజు పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నందున ఆ సందర్భంగా కూడా హింస చెలరేగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్తచర్యగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ఆ క్రమంలో గూడూరు పట్టణం గాంధీనగర్, ఇందిరానగర్, చవటపాలెం, టిడ్కో ఇళ్ళ సముదాయం తదితర ప్రాంతాలను పోలీసు బలగాలు చుట్టుముట్టి విస్తృత తనిఖీలు చేపట్టాయి.ఉదయం 8 గంటల నుంచీ 10 గంటల వరకూ దాదాపు ఇల్లిల్లూ గాలించారు. సరైన పత్రాలు లేని మూడు ఆటోలు, 30 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూళ్ళూరుపేట పట్టణం సూళ్లూరు ప్రాంతాన్ని పోలీసులు కార్డన్ సెర్చిలో భాగంగా జల్లెడ పట్టారు. ఉదయం 6 గంటల నుంచీ 9 గంటల వరకూ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలూ లేని ఏడు బైక్‌లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ ఇంట్లో రెండున్నర కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఓ మహిళ సహా ముగ్గురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. ఇక నాయుడుపేట పట్టణం ఎన్ఎస్ఆర్ కాలనీలో వేకువజామున 5.30 గంటల నుంచీ ఉదయం 7.30 గంటల వరకూ కార్డన్ సెర్చిలో భాగంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో దౌర్జన్యకర వాతావరణం నెలకొని వుంటుందని, గంజాయి అమ్మకాలు కూడా జరుగుతుంటాయని సమాచారం. అయితే పోలీసు తనిఖీల గురించి ముందే సమాచారం లీక్ కావడంతో అసాంఘిక శక్తులు అప్రమత్తమయ్యాయని, అందుకే అనుమానితులు ఎవరూ పట్టుబడలేదని తెలిసింది. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట గ్రామంలో పోలీసు బలగాలు తెల్లవారుజామున 5 గంటల నుంచీ 7 గంటల వరకూ ఇల్లిల్లూ తనిఖీ చేశాయి. అయితే అనుమానితులు గానీ, ఇతరత్రా నిషేధిత వస్తువులు గానీ, పత్రాలు లేని వాహనాలు గానీ పట్టుబడలేదు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన ఎస్పీ



స్ట్రాంగ్ రూము వద్ద సీసీ కెమెరాలను పరిశీలిసున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, మే 21: చిత్తూరులోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచిన ఈవీఎంలను మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. వర్షాల కారణంగా స్ట్రాంగ్‌రూముల స్థితిగతులను చూశారు. వర్షపు నీరు స్ట్రాంగ్‌రూముల్లోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సీసీ కెమెరాలను పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏఎస్పీ అరీఫుల్లా, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఆర్ఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ రవిమనోహరాచారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), మే 21: తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ, అలిపిరి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు. కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, అన్ని ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి, సంఘ విద్రోహక శక్తులకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా సిబ్బంది సహకరించాలన్నారు. అలాగే అలిపిరి సీఐగా రామారావు మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పోలప్ప

ములకలచెరువు, మే 21: సచివాలయ సిబ్బంది అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పోలప్ప హెచ్చరించారు. మండలంలోని కదిరినాథునికోట గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఖచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. సమయపాలన పాటించకపోవడం, అనుమతి లేకుండా విధులకు హాజరుకాకపోతే జీతాలు నిలిపేస్తామన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పనులపై సచివాలయాలకు వచ్చే గ్రామస్థుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

చౌడసముద్రంలో కార్డెన్ సెర్చ్

ములకలచెరువు, మే 21: మండలంలోని చౌడసముద్రంలో మంగళవారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని, దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిప్పేస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతతకు ఎవరైనా భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ తనిఖీల్లో ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె టౌన్, మే 21: మద్యం తాగి ఇంటికొచ్చిన వ్యక్తిని కుటుంబీకులు మందలించడంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని బాబుకాలనికి చెందిన మహబూబ్‌బాషా(30) ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతను భార్య భానుతో కలసి బాబుకాలనిలో నివాసమున్నాడు. మద్యానికి బానిసైన మహబూబ్‌బాషా రోజు మద్యం తాగి వచ్చి కుటుంబీకులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి రాగా కుటుంబీకులు మందలించడంతో మనస్థాపం చెందిన అతను ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులకు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు

వృద్ధుడి అదృశ్యం పై కేసు నమోదు

మదనపల్లి అర్బన్ మే 21 : వృద్ధుడి అదృశ్యం పై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు. పోలీసుల కథనం మేరకు అనపగుట్టకు చెందిన షేక్ సయ్యద్ మీర్ (55) రెండు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. అనారోగ్య కారణంగా ఇల్లు వదిలి వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు . మంగళవారం అతని కుమార్తె ఆయేశ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు .

రాష్ట్రకమిటీ సమావేశాలు జయప్రదం చేయాలి

మదనపల్లె అర్బన్, మే 21:హార్సిలీహిల్స్‌లో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని వ్యవసాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సంఘ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ దేశంలో నేటికీ 65 శాతం పైగా వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆ రంగాన్ని కార్పొరేట్స్‌కు కట్టపెట్టే ఉద్దేశ్యంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని తద్వారా వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోతోందన్నారు. దీనిపై ఆధారపడిన ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల, కర్షకుల కోసం అనేక పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ కార్మికుల సంఘాల ఉద్యమాల రూపకల్పన కు హార్సిలీహిల్స్‌లో రాష్ట్రకమిటీ సమావేశాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశాల్లో అఖిల భారత వ్యవసాయం సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్, ఉపాధ్యక్షుడు వి క్రమ్ సింగ్, అధ్యక్షుడు సుబ్బారావు కమిటీ సభ్యులు పాల్గొంటార న్నారు.

రేపు మండల సమావేశం

వాల్మీకిపురం, మే 21: వాల్మీకిపురం మండల సమావేశం ఈనెల 23 న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

విత్తనకాయల కోసం ఎదురుచూపు

● మండలానికి చేరని వేరుశనగ విత్తనకాయలు ●ఈ సారైన కొరతలేకుండా పంపిణీ జరిగేనా? ● ఆందోళనలో రైతన్నలు

గుర్రంకొండ, మే 21:ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేరుశనగ పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ఇప్పటి వరకు మండలానికి వేరుశనగ విత్తనకాయలు చేరకపోవడంతో రైతులు వాటి కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. పొలాలను సాగు చేయడానికి రైతులు దుక్కులను చేస్తున్నారు. ఈ ఏడాదైన వేరుశనగ పంట బాగా పండితే తమ కష్టాలు తీరుతాయని కోటి ఆశలతో సాగుకు సిద్ధమవుతున్నా ప్రభుత్వం సబ్సిడీపై అందించే వేరుశనగ విత్తనకాయల కోసం రైతులు అష్టకష్టాలు పడాల్సివస్తోంది. ఈ విత్తనకాయలు మొదట తీసుకున్న రైతులకు మాత్రమే అందుతూ అలస్యంగా వచ్చి తీసుకొనే రైతులకు అందడం లేదు. దీంతో విత్తనకాయలు కొరత ఏర్పడి రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు దళారులు విత్తనకాయలను బ్లాక్ మార్కెట్‌లో అధిక రేట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీల్లో ఎక్కువ సంఖ్యలో రైతులు వేరుశనగ పంటను సాగు చేస్తారు. ఇందులో భాగంగా 2500 హెక్టార్లలో ప్రతి ఏటా రైతులు వేరుశనగ పంటను సాగు చేస్తారు. గతేడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో వేరుశనగ పంటపై రైతులు ఆసక్తి వదులుకున్నారు. ఈ క్రమంలో ఏడాది ఏడాదికి వేరుశనగ పంట సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. ఇందుకుగాను వ్యవసాయశాఖ అధికారులు ప్రతి ఏటా 1100 నుంచి 1500 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను తెప్పిస్తున్నారు. గతేడాది రైతులకు అనుగుణంగా విత్తనకాయలను తెప్పించుకోకపోవడంతో విత్తనకాయల కొరతతో చాలా మంది రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు విత్తనకాయలు మండలానికి చేరకపోవడం రైతులను కలవరపెడుతుంది.



సాగుకు దుక్కులు దున్ని సిద్ధం చేసిన పొలం

మండలానికి చేరని విత్తనకాయలు

గుర్రంకొండ మండలానికి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ దాదాపుగా ప్రారంభం కావడంతో ఈ ఏడాది కూడా విత్తనకాయల కొరత ఏర్పడుతుందా..? అనీ రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి విత్తనకాయలు సకాలంలో పంపిణీ చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో ఆర్బీకేలకు విత్తనకాయలు

రెండు రోజుల్లో అన్ని ఆర్బీకేలకు వేరుశనగ విత్తనకాయలు వస్తాయని ఇన్‌చార్జి ఏవో నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలానికి ఇంకా విత్తనకాయలు రాని విషయం ఇన్‌చార్జి ఏవో నవీన్‌రెడ్డి వివరణ కోరగా గుర్రంకొండ మండలంలో రైతులకు అవసరమైన విత్తనకాయల కోసం జిల్లా అధికారులకు వివరాలను పంపామన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



పీటీఎంలో నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గుర్రంకొండలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పెద్దతిప్పసముద్రం మే 21 : లక్ష్మీనరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రం చింతామణి సమీపంలోని ఎగువకోటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వేణుగోపాల శర్మ, కన్నాస్వామిలచే వైభవంగా, కమనీయంగా నిర్వహించారు. నరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున అందున లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అర్చన, పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణాన్ని పీటీఎంకు చెందిన ఆధ్యాత్మికవేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

గుర్రంకొండలో: గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం అనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు రాగా తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, అనిల్, గోకుల్, వరద, వెంకీ, ఆలయాధికారి కృష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ పాల్గొన్నారు.

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

ములకలచెరువు, మే 21: మండలంలోని సోంపల్లెలో వెలసిన కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో గురువారం మహాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, సీతారామ కల్యాణోత్సవం, గరుడ వాహన గ్రామోత్సవం ఉంటుందన్నారు. శుక్రవారం వేద పారాయణము, హనుమద్వాహన గ్రామోత్సవం, శనివారం శ్రీవారి బ్రహ్మ రథోత్సవంజరుగుతాయన్నారు.

గ్రామీణులకు సౌకర్యంగా వైద్య సేవలు

కలకడ, మే 21:గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్య సేవలు సౌకర్యంగా మారాయని వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి నవాబ్‌పేటలో గ్రామస్థులు 72 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సి జాగ్రత్తలను సూచించారు. ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సర్వభూపాల వాహనంపై కటాక్షించిన శ్రీనివాసుడు



సర్వభూపాల వాహనంపై వేంకటేశ్వరుడు

మదనపల్లి అర్బన్ మే 21 : ప్రసన్న వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సర్వభూపాల వాహనంపై శ్రీనివాసుడు ఊరేగి భక్తులను కటాక్షించాడు. ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయాన్నే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు . పూజాకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం, నీరుగట్టువారి పల్లిలో సర్వభూపాల వాహనంపై స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. పురవీధుల్లో కర్పూర హారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

డబుల్ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?

●గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణించాలంటే హడలుతున్న జనం ● దుస్థితిలో నిమ్మనపల్లె-కందూరు రోడ్డుమార్గం



మాచిరెడ్డిగారిపల్లె సమీపంలో గుంతలు పడిన రోడ్డుపై వాహనదారుల పాట్లు

నిమ్మనపల్లి, మే 21: ప్రభుత్వాలు ఎన్ని మారినా కూడా నిమ్మనపల్లె-కందూరు డబుల్ రోడ్డుకు మోక్షం కలిగే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో వాహనదారులు, సింగల్ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది క్షతగాత్రులుగా మారుతుంటే కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండు నెలల క్రితం ఓ మినీ బస్సు ఆటోను ఢీ కొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. అంతే కాకుండా ఏడాదికి దాదాపు 10మందికి పైగా రోడ్డు ప్రమాదాలకు గువుతున్నారు. గత ప్రభుత్వంలో ఆచార్లపల్లె నుంచి చల్లావారిపల్లె వరకు డబల్ రోడ్డు పనులు చేపట్టారు. మిగిలిన 20కిలో మీటర్లు డబల్ రోడ్డు వేయాల్సి వుండగా దానిని పట్టించుకోలేదు. నాయకులు, అధికారులు మారినప్పటికి డబల్ రోడ్డుపై కేవలం ప్రకటనలు చేస్తున్నారే తప్ప రోడ్డు వేసిన పాపాన పోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ముష్టూరు పంచాయతి వలసపల్లె నుంచి బాహుదా ప్రాజెక్టుకు ఉన్న 2కిలో మీటర్లు మట్టి రోడ్డును కూడా గాలికి వదిలేశారు. ప్రస్తుతం మదనపల్లె నుంచి కందూరుకి వెళ్లాలంటే సింగల్ రోడ్డులో గుంతల మయం కావడంతో వాహనదారులు ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. దీనికి తోడు నిత్యం మండలంలోని రైతులు పండించిన టమోటా పంటను అమ్మాలంటే మదనపల్లె మార్కెట్‌కు తరలించాలి. గుంతలు పడిన రోడ్డులో ప్రయాణించేందుకు దాదాపు రెండు గంటల పాటు పడుతుందని ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియరాని పరిస్థితి. అంతే కాకుండా నిమ్మనపల్లె నుంచి తిరుపతి, కలికిరి, సదుం, పుంగనూరులకు దారులు ఉన్నా రోడ్డు సక్రమంగా లేక బస్సులు నడవడం లేదు. ప్రమాదాలు జరిగితే 108 వాహనంలో మదనపల్లెకు వెళ్లాలంటే మార్గ మధ్యంలోనే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పాలకులు కూడా అధికారం వచ్చిన వెంటనే డబల్ రోడ్డు పనులు నిర్మిస్తామని వాగ్దానాలు చేసి వాటిని మరచిపోయారు. ఇలా అయితే రోడ్డుపై ప్రయాణం సాగించాలన్నా ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురువతున్నారు. కనీసం వచ్చే ప్రభుత్వం అయినా గుంతల మయంగా ఉన్న నిమ్మనపల్లె- కందురూ మార్గాన్ని డబల్ రోడ్డు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ధర్మపథంలో పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, మే 21: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని. ధర్మపథంలో గురువారం పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిషేకాలు, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు నిర్వహించనున్నారు.

నేడు గోపగుడిపల్లిలో జయంత్యుత్సవాలు

రామాపురం, మే 21: మండలంలోని గోపగుడిపల్లె పంచా యతీలోని వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి జయంతి ఉత్సవాలను బుధ వారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉద యం సుప్రభాత సేవ, మహాగణపతిపూజ స్వస్తివాచనం పంచామృత అభిషేకాలతో పూజలు, జపాలు, హోమాలు నిర్వహిస్తారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

1770 క్వింటాళ్ల వేరుశనగ కాయలు సిద్ధం



రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏవో రమాదేవి

పీలేరు, మే 21: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అనువుగా మండలంలో 1770 క్వింటాళ్ల నారాయణి రకం వేరుశనగ విత్తన కాయలు సిద్ధంగా ఉన్నట్లు పీలేరు వ్యవసాయాధికారిణి రమాదేవి తెలిపారు. మండలంలోని అగ్రహారం రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సన్నాహక ప్రక్రియలో భాగంగా మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతుల రిజి స్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. 1770 క్వింటా ళ్ల నారాయణి రకం విత్తన కాయలు సిద్ధంగా ఉన్నా యని, క్వింటాల్ ధర రూ.5820లుగా ప్రభుత్వం నిర్ణయించిందని విత్తన కాయలు కావా ల్సిన రైతులు తమ సమీప రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా, వీలైనంత త్వరగా రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. విత్తన కాయల పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

నేటి నుంచి విత్తనాల పంపిణీ కోసం రిజిస్ట్రేషన్..

రామసముద్రం, మే 21: రామసముద్రం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ, జనుము విత్తనాల కొరకు బుధవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో మోహన్‌కుమార్ తెలిపారు. ఇందుకోసం రైతులు వారి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ తీసుకొచ్చి బయోమెట్రిక్ వేసి, విత్తనాల కోసం నగదు ముందుగానే చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన చెప్పారు. రామసముద్రం మండలానికి 1840 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించారని అవి ఆయా ఆర్బీకేలకు రైతుల భూమి ప్రాతిపదికన పంపిణీ చేస్తామని ఏవో తెలిపారు. రాయితీపై 30కేజీల వేరుశనగ బస్తా ధర రూ.1710, అదేవిధంగా 10కేజీల జనుము బస్తా ధర రూ.440 విత్తనాలు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో పంపిణీ చేస్తామన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పంటల సాగు నమూనాను విద్యార్థులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త మాధురి

పీలేరు, మే 21: వ్యవసాయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాధురి తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లా మహానందిలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం పీలేరు మండలంలోని వేపులబైలు గ్రామాన్ని సందర్శించారు. వారికి కేవీకే శాస్త్రవేత్త పీలేరు ప్రాంతంలో సాగయ్యే పంటలు, సాగు చేసే తీరు, పాటించే యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఆ గ్రామ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసుకునేలా రైతుల్ని చైతన్యవంతుల్ని చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వారు వేపులబైలు పంచాయతీ మిట్టపల్లె గ్రామంలో సాగవుతున్న వివిధ పంటలు, వాటిని సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

వ్యవసాయ ఎగుమతులకు పంట నాణ్యత కీలకం



రైతు సదస్సులో మాట్లాడుతున్న పాండురంగ

కలికిరి, మే 21: వ్యవసాయరంగంలో విస్తృతంగా ఎగుమతులు సాధించడానికి పంట ఉత్పత్తుల నాణ్యత ముఖ్యమని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక కేవీకేలో జరిగిన రైతు సదస్సులో ఆమె మాట్లాడారు. కేవీకే కోఆర్డినేటర్ పాండురంగ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలని సూచించారు. శాస్త్రవేత్తలతో రైతులు అనుసంధానించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు సిద్ధం చేసిన వ్యవసాయ ప్రదర్శనలను పరిశీలించారు. ఈ సదస్సులో స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేష్, డాక్టర్ పీవీ గీత శిరీషా, శాస్త్రవేత్తలు మాధురి, పీరూసాహెబ్, సోమశేఖర్ బాబు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం విరివిగా చేపట్టాలి



ఉపాధి హామీ పథకం పనులు పరిశీలిస్తున్న నందకుమార్

రామసముద్రం, మే 21: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం, పశుగ్రాసం పెంపకం వంటి పనులు చేపట్టి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని కలికిరి ఏపీడీ నందకుమార్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలోని కేసీపల్లె, కురప్పల్లెలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలు, మేట్లు, ఫీల్డ్ సిబ్బందితో వివిధ పనులపై సమీక్ష నిర్వహించారు. కూలీల పనిదినాలు పెంచాలని, ఈ ఏడాదికి నిర్దేశించిన పనులు పూర్తి కోసం ముమ్మరంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో గౌరీశంకర్, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ మహోన్నత వ్యక్తి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్, మే21: దేశానికే దిశా నిర్దేశం చూపిన స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ మహోన్నత వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ నాయకుడు ఎస్.రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. నవభారత నిర్మాత, నవయువతకు స్ఫూర్తి ప్రదాత, సాంకేతిక సృష్టికర్త మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 33వ వర్థతిని మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు. ప్రపంచంలో ఎక్కడో పుట్టిన కంప్యూటర్ రంగాన్ని మన దేశానికి పరిచయం చేసి ఎంతో మంది విద్యార్థులు సాంకేతిక విద్య నేర్చుకొనేలా చేసింది రాజీవ్‌గాంధీనే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ము బారక్‌ఖాన్, మీనాకుమారి, డాక్టర్ ఎస్కేబాషా, మహబూబ్‌పీర్, రవీంద్ర, నాగరాజు, మహమ్మద్‌అలీ, శ్రీనివాసులు, మస్తాన్, సుబ్రహ్మణంరెడ్డి, ద్వారకనాథ రెడ్డి, సోను పాల్గొన్నారు.

షాజహాన్‌బాషాను కలిసిన బలిజసంఘం నాయకులు



షాజహాన్‌బాషాను అభినందిస్తున్న బలిజ సేవా సమితి నాయకులు

మదనపల్లె టౌన్, మే 21: మదనపల్లె బలిజ సేవా సమితి నాయకులు మంగళవారం ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బీపీఎల్ విజయకుమార్, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు కలసి షాజహాన్‌బాషాకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. అనంతరం షాజహాన్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు సీఎం అవుతారన్నారు. మదనపల్లెలో బలిజ కులస్థులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మిభాస్కర్, కాపునాడు ఉపాధ్యక్షుడు ఆంజినేయకుమార్, జంగాల శివరామ్, టిశ్రీనివాసులు, రాజా, పగడాల సూర్యనారాయణ, మదన, భాను, వేణు, సాగర్ పాల్గొన్నారు.

కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లతో తాగునీటి సమస్య



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

కలికిరి, మే 21: త్రాగునీటి పథకాల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నాయని, దీంతో తాగునీటికి సమస్య ఏర్పడుతోందని గుట్టపాళెం సర్పంచు వెంకట రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జరిగిన కలికిరి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి అమర్చడంలో విద్యుత్ శాఖ అధికారులు అలసత్వం చూపిస్తున్నారని ఆరోపించారు. సమావేశాన్ని ప్రారంభించిన ఎంపీపీ నూర్జహాన్ మాట్లాడుతూ ఇటీవల ఆకస్మికంగా మరణించిన కలికిరి సర్పంచుప్రతాప్‌కుమార్ రెడ్డి గౌరవార్థం రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించాల్సిందిగా కోరారు. గ్రామాల్లో పారిశుధ్య పనుల పైన ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రామకృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. విద్య, వైద్య, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖల పురోభివృద్ధిపై వివరించారు. జడ్పీటీసీ పద్మజ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరయ్యారు.